క్లుప్తంగా

జీయర్‌స్వామి రథోత్సవం



స్వామివారిని దర్శించుకున్న భక్తులు

శంకరపట్నం: కేశవపట్నంలో శుక్రవారం చిన్న జీయర్‌స్వామి రథోత్సవం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆంజనేయస్వామి మాలధారణ స్వాములు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన



కొనుగోళ్లను పరిశీలిస్తున్న చైర్మన్ మధుకర్‌రెడ్డి

శంకరపట్నం: మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తాడికల్ సహకార సంఘం చైర్మన్ మధుకర్‌రెడ్డి పరిశీలించారు. తాడికల్, కేశవపట్నం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తాలు, లోడింగ్, హమాలీల విషయాలపై రైతులతో మాట్లాడారు. వర్షం సూచన ఉండటంతో త్వరితగతిన ధాన్యాన్ని తూకం వేసి రైస్‌మిల్లులకు తరలించాలని సూచించారు.

ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావేదిక



మాట్లాడుతున్న అధికారులు

శంకరపట్నం: ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల కోడ్ నిబంధనల మేరకు అంతర్గతంగా కార్యాలయంలోనే ప్రజావేదిక నిర్వహించారు. మండలంలో సుమారు రూ.4కోట్ల ఉపాధిహామీ పనులు జరగగా.. వీటిపై పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్ల సమక్షంలో సామాజిక తనిఖీ బృందం ప్రజావేదికలో వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో శ్రీధర్, ఎంపీడీవో శ్రీవాణి, ఏపీవో శారద, సోషల్ ఆడిట్ బృందం పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

శంకరపట్నం: స్థానిక హైస్కూల్‌లో వారం రోజులుగా ఆకుబత్తిని లక్ష్మి–శంకరయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు విజయ్ బ్రదర్స్ క్రికెట్ పోటీలను నిర్వహించారు. శుక్రవారం విజేత ఛాలెంజర్ టీమ్‌కు ప్రథమ బహుమతి దక్కింది. నిర్వాహకులు దేవేందర్, మార్కండేయ, సత్యనారాయణ, సుధాకర్, శ్రీకాంత్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి దందా

మానకొండూర్‌రూరల్: మండలంలో మట్టి దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. మాఫియాదారులు ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కుంటలు, చెరువులను తవ్వి అర్ధరాత్రి ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. కళ్ల ముందు నుంచి మట్టి రవాణా జరుగుతున్నా.. రెవెన్యూ, మైనింగ్, పోలీసులు అటువైపు కన్నెత్తి చూడడం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. అన్నారం గ్రామ పంచాయతీ పరిధి రాఘవాపూర్ శివారులో జవారుకుంట నుంచి మట్టిని మాఫియాదారులు కొద్ది రోజుల నుంచి అక్రమంగా తరలిస్తున్నారు. కుంట మట్టిని తీయడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని మట్టి అక్రమ రవాణాను ఆపాలని వేడుకుంటున్నారు.



రాఘవాపూర్‌లో మట్టిని తవ్విన జవారుకుంట

చెత్తకుప్పలో ఆడ శిశువు మృతదేహం



హుజూరాబాద్: కన్నతల్లి పొత్తిళ్లలో వెచ్చగా నిద్రించాల్సిన ఆ శిశువు చెత్తకుప్పలో నిర్జీవంగా పడి ఉంది. నెలలు కూడా నిండని ఆ ఆడశిశువు మృతదేహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు చెత్తకుప్పలో పడేశారు. ఈ హృదయ విదారక సంఘటన శుక్రవారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో చోటుచేసుకుంది. హుజూరాబాద్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మరుగుదొడ్ల సమీపంలోని ఓ చెత్తకుప్పలో ఆడశిశువు మృతదేహం కనిపించింది. బస్టాండ్‌లోకి వెళ్తున్న పలువురు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని శిశువు మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. శిశువు మృతదేహం ఎక్కడి నుంచి అయినా తెచ్చి ఇక్కడ పడేశారా..? ఆడపిల్ల అని ఆ తల్లి బంధం తెంచుకుందా..? ఎవరు శిశువు మృతదేహాన్ని పడేసి వెళ్లారు..? అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. సీసీ కెమెరాల ద్వారా పరిశీలిస్తున్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం



పార్టీలో చేరినవారితో చాడ వెంకటరెడ్డి

సైదాపూర్: రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర చేస్తున్న బీజేపీని ఓడించాలని, కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని ఇందుర్తి మాజీ ఎమ్మెల్యే, సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకటరెడ్డి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, సభ్యుడు బత్తుల బాబు, బోయిన అశోక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీని నిలువరించాలి

చిగురుమామిడి: మతోన్మాద బీజేపీ పార్టీని ఈ సారి కేంద్రంలో అధికారంలోకి రాకుండా నిలువరించాల్సిన అవసరం ఉందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చిగురుమామిడి మండలం రేకొండలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు పక్షాన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామ కూడలిలో ఓటర్లనుద్దేశించి మాట్లాడుతూ మోదీ రెండుసార్లు ప్రధానమంత్రిగా ప్రజలకు ఎలాంటి ప్రయోజనం చేకూర్చలేదన్నారు. మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని, రిజర్వేషన్లు రద్దు చేస్తామని అమిత్‌షా అంటున్నారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఇండియా కూటమి గెలువబోతోందన్నారు. రాష్ట్రంలోనూ డబుల్ డిజిట్ ఎంపీ స్థానాలు కాంగ్రెస్‌పార్టీ గెలువబోతోందని జోస్యం చెప్పారు. ఎవరెన్ని ప్రలోభాలు పెట్టినా కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని కోరారు. సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు బోయిని అశోక్, సింగిల్‌విండో డైరెక్టర్ చాడ శ్రీధర్‌రెడ్డి, సీపీఐ గ్రామ కార్యదర్శి బోయిని వల్లభాయ్ పటేల్ పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: శాలపల్లి–ఇందిరానగర్ గ్రామ మాజీ సర్పంచ్ కొడిగూటి శారద ప్రవీణ్ శుక్రవారం సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి వెంకటస్వామి ఆధ్వర్యంలో సీపీఎంలో చేరారు. అంతడుపుల విద్యాసాగర్ సైతం పార్టీలో చేరగా.. పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

పార్టీల ప్రచారం

మానకొండూర్: మానకొండూర్, పచ్చునూర్, కొండపల్కల, ఊటూర్, లక్ష్మిపూర్ గ్రామాల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ ఇంటింటా ప్రచారం నిర్వహించాయి. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటేసి గెలిపించాలని గ్రామస్తులను ఓట్లు అభ్యర్థించారు.

పంచాయతీ ట్రాక్టర్ టైర్లు చోరీ

ఇల్లందకుంట: గడ్డివానిపల్లి పంచాయతీకి సంబంధించిన ట్రాక్టర్ టైర్లను గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ట్రాక్టర్‌ను గ్రామ పంచాయతీ వద్ద కొద్ది రోజులుగా పార్క్ చేశారు. దొంగలు ట్రాక్టర్ టైర్లను విప్పడానికి జాకీ సహాయంతో ఇటుకలు, రాళ్లను సపోర్టుగా పెట్టి టైర్లను ఎత్తుకెళ్లారు. విషయాన్ని గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు గడ్డి శ్రీనివాస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు స్పందించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో కూడా గ్రామ పంచాయతీ ఫ్యాన్, బోరు మోటార్ చోరీకి గురైనా అధికారులు పట్టించుకోలేదని అన్నారు.

రుమాల్ క్లాత్‌లు పట్టివేత

తిమ్మాపూర్: రేణికుంట చెక్‌పోస్టు వద్ద హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వస్తున్న కారులో 750 పకిడి రుమాల్ క్లాత్‌లు పట్టుకున్నారు. ఈ రుమాల్ క్లాత్ బీఆర్‌ఎస్ పార్టీ రోడ్ షో కార్యక్రమానికి తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు మహమ్మద్ కరీముద్దీన్, అబ్దుల్ సలాం, సయ్యద్ ఫయాజ్ హుస్సేన్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మోసం చేసిన వ్యక్తులపై కేసు

ఇల్లందకుంట: దళితబంధు కొటేషన్ ఇప్పిస్తామని మోసం చేసిన వ్యక్తులపై శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సీతంపేట గ్రామానికి చెందిన ఇల్లందుల సౌమ్యకు దళితబంధు మంజూరయ్యింది. సెంట్రింగ్ కొటేషన్ ఇప్పిస్తానని శ్రీరాములపేటకు చెందిన మేకల తిరుపతి హైదరాబాద్‌కు చెందిన సాయి బాలాజీ ట్రేడర్స్ ద్వారా ఒప్పందం చేసుకున్నాడు. సౌమ్య చనిపోయిందని అబద్ధం చెప్పి దళితబంధులో మంజూరయిన రూ.5లక్షలను తన భార్య మేకల రమ అకౌంట్‌లోకి బదిలీ చేశారు. దీనికి సాయి బాలాజీ ట్రేడర్స్ యజమాని సతీష్ సహకరించాడు. ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ మృతి

చొప్పదండి: చొప్పదండి వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గుర్రం ఏసురెడ్డి(68) శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. మూడు దశాబ్దాల క్రితం ఆయన కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చొప్పదండి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పని చేశారు. కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించిన ఏసురెడ్డి కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

కౌశిక్‌రెడ్డి ఇంట్లో కేటీఆర్ బస

వీణవంక/హుజూరాబాద్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వీణవంకలోని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటికి శుక్రవారం రాత్రి చేరుకున్నారు. ఇక్కడే బస చేయనున్న ఆయన శనివారం హుజూరాబాద్‌లోని సూపర్ బజార్‌లో ఉదయం 8 గంటలకు జరిగే కార్నర్ మీటింగ్‌లో పాల్గొననున్నారు. కమలాపూర్ మండలంలో జరిగిన మీటింగ్‌లో పాల్గొన్న కేటీఆర్ నేరుగా కౌశిక్‌రెడ్డి ఇంటికి చేరుకున్నారు.

బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి



ఇల్లందకుంట: ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న డాక్టర్ హర్షిణి

హుజూరాబాద్: బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్‌కు మద్దతుగా శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 29వ వార్డులో వార్డు కౌన్సిలర్ ముక్క రమేశ్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతి సమస్యపై మాట్లాడి ప్రజల పక్షాన కొట్లాడే వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: కరీంనగర్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌కు మద్దతుగా శుక్రవారం ఆయన కోడలు హర్షిణి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మల్యాల గ్రామంలో భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఎంపీపీ సరిగొమ్ముల పావని వెంకటేశ్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: మన్నెంపల్లి గ్రామంలో వినోద్‌కుమార్ తరపున నాయకులు ప్రచారం చేశారు. మాజీ ఉప సర్పంచ్ పొన్నం అనిల్‌గౌడ్ ఆధ్వర్యంలో ముదిరాజ్ కుల సంఘం నాయకులను కలిసి గెలిపించాలని కోరారు. నార్ల అశోక్, కొమురయ్య, తిరుపతి, జగదీష్, బూడిద కిషోర్, కిరణ్, కామెర సంపత్, బీనపల్లి బాలయ్య, బొజ్జ శ్రీనివాస్, కొలిపాక రాజయ్య, రాజమౌళి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: లంబాడిపల్లి గ్రామంలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్ పక్షాన చిగురుమామిడి ఎంపీపీ కొత్త వినీతశ్రీనివాస్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు మామిడి అంజయ్యతో కలిసి ఉపాధిహామీ పని ప్రదేశంలో కూలీలనుద్దేశించి మాట్లాడారు. కొత్త శ్రీనివాస్‌రెడ్డి, చందబోయిన ఎల్లయ్య, నాగెల్లి రాజిరెడ్డి, వెంకటయ్య తదితరులున్నారు.

నియంతృత్వ పాలనకు చరమగీతం పాడాలి



గన్నేరువరంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి, నాయకుల బైక్ ర్యాలీ



హుజూరాబాద్‌లో ప్రచారం చేస్తున్న మర్రి వెంకటస్వామి

• ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

గన్నేరువరం: బీజేపీ ఆధ్వర్యంలో కేంద్రంలో నియంతృత్వ పాలన సాగుతోందని, ఈ పార్లమెంట్ ఎన్నికల్లో దానికి చరమగీతం పాడాలని మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కోరారు. కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా శుక్రవారం గుండ్లపల్లి నుంచి గన్నేరువరం వరకు మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీకి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంపీపీ లింగాల మల్లారెడ్డి, యువజన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి అనంతరెడ్డి, ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శంకరపట్నం: తాడికల్‌లో శుక్రవారం మోటార్ సైకిల్ ర్యాలీని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కీసరి సుజాత దంపతులు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్, బసవయ్య, నరసింహస్వామి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించి దేశాన్ని రక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి కోరారు. పట్టణంలోని మార్కెట్ ఏరియాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వెలిచాల రాజేందర్‌రావు గెలుపును మతతత్వ శక్తులు, దానికి పరోక్షంగా సహకరించే శక్తులు అడ్డుకోలేవన్నారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేశ్, జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాముయాదవ్, సీపీఐ పట్టణ కార్యదర్శి ముత్త రాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: ఉపాధిహామీ పథకం తెచ్చిందే కాంగ్రెస్ పార్టీ అని, అర్హులైన లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని, ఫేక్ వీడియోలు చూసి మోసపోకండని కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంతోపాటు మల్యాల, సిరిసేడు, రాచపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: కొత్తపల్లిలో వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా ఇల్లందకుంట శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ దేశిని కోటి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. దేశిని శ్రీనివాస్, ఎండీ సజ్జు, ఉడుత వెంకటేశ్, సంకీస సురేష్, రాజ్‌కుమార్, దేవరాజ్, రాంచందర్, నరేందర్, మైనోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: దత్తోజీపల్లి గ్రామంలో వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. బండ అజయ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను పెంపొందించుకోవాలి

హుజూరాబాద్‌రూరల్: విద్యార్థులు ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను పెంపొందించుకోవాలని కిట్స్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ కందుకూరి శంకర్ అన్నారు. సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఐఎస్‌టీఈ, మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్డీనో ఫర్ బిగినర్స్ అనే అంశంపై వారం రోజులపాటు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న విషయాలను ప్రయోగపూర్వకంగా సరిచూసుకున్నప్పుడే విషయం కూలంకషంగా అర్థమవుతుందన్నారు. కంప్యూటర్ రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని, మార్పులకనుగుణంగా విద్యార్థులు స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఈశ్వరయ్య, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి, డీన్ డాక్టర్ ఎం.వి.సతీష్‌కుమార్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ డాక్టర్ యోగేష్ పుండలిక్, కళాశాల రిజిస్టర్, హ్యూమానిటీస్ అండ్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ వి.రాజేశ్వరరావు, కళాశాల అకాడమిక్ ఇన్‌చార్జి డాక్టర్ జి.మల్లయ్య, మెకానికల్ ఇంజనీరింగ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రాజేంద్రప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్వింటాల్ పత్తి రూ.7,100

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర గరిష్టంగా రూ.7,100 పలికింది. శుక్రవారం మార్కెట్‌కు నాలుగు వాహనాలలో 73 క్వింటాళ్ల పత్తిని రైతులు తెచ్చారు. క్వింటాల్‌కు మోడల్ ధర రూ. 7,000, కనిష్ట ధర రూ.6,860కు ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేశారు. శని, ఆదివారాలు సాధారణ, సోమవారం పోలింగ్ నేపథ్యంలో సెలవులు ఉంటాయని, మంగళవారం య థావిధిగా క్రయవిక్రయాలు కొనసాగుతాయని కార్యదర్శి గుగులోతు రెడ్డినాయక్ వివరించారు.

టీపీసీసీ లీగల్ సెల్ అధికార ప్రతినిధికి సన్మానం

సైదాపూర్: టీపీసీసీ లీగల్ సెల్ అధికార ప్రతినిధిగా నియమితులైన తర్వాత సొంత మండలం వచ్చిన వేముల రమేశ్‌కు మండల కాంగ్రెస్ నాయకులు మండల కేంద్రంలో శుక్రవారం ఘన స్వాగతం పలికారు. పార్టీ కార్యాలయంలో శాలువా, పూలదండలతో సన్మానించారు.

రిజర్వేషన్లు ఎత్తేసే కుట్రకు తెర తీస్తున్న బీజేపీ

జమ్మికుంట: బీజేపీ ప్రభుత్వం రిజర్వేషన్లు ఎత్తేసే కుట్రకు తెర తీస్తోందని మాజీ ఎమ్మెల్యే అరెపల్లి మోహన్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో దళిత, గిరిజన ప్రజాచైతన్య సమావేశం నిర్వహించారు.

సదస్సు కరపత్రం ఆవిష్కరణ

హుజూరాబాద్: ప్రమాదంలో భారత ప్రజాస్వామ్యం సదస్సు కరపత్రాన్ని శుక్రవారం హుజూరాబాద్ పట్టణంలో ప్రజాసంఘాల నాయకులు ఆవిష్కరించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం జేఏసీ, భారత్ బచావో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 11న హుజూరాబాద్ పట్టణంలోని సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్‌లో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేల్పుల రత్నం, భీమోజు సదానందం, పాడిశెట్టి వెంకట్రాజం, మార్త రవీందర్, ఈశ్వర్‌రెడ్డి, టీఎస్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వరి ధాన్యం తూకం వేయరా..?



గంగాధర: వడ్లు తీసుకొచ్చి నెల రోజుల కావస్తున్నా తూకం వేయడం లేదని ఓ రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. మంగపేట గ్రామానికి చెందిన మల్యాల నర్సయ్య అనే రైతు గ్రామంలోని కొనుగోలు కేంద్రానికి గత నెల 16న ధాన్యం తీసుకొచ్చాడు. నిర్వాహకులు సంబంధం లేని కారణాలు చెబుతున్నారని వాపోయాడు.

మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



సంతోష్‌కుమార్‌ను ఆహ్వానిస్తున్న పొన్నం

చిగురుమామిడి: ఇందుర్తి గ్రామానికి చెందిన బీజేపీ మండల శాఖ ఉపాధ్యక్షుడు కూన సంతోష్‌కుమార్ శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కరీంనగర్‌లోని మంత్రి కార్యాలయంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈనెల 13న జరిగే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావు గెలుపునకు కృషి చేయాలని సంతోష్‌కుమార్‌ను మంత్రి ఆదేశించారు. నాయకులు, కార్యకర్తలున్నారు.

బసవేశ్వర జయంతి

హుజూరాబాద్‌రూరల్: చెల్పూర్ గ్రామంలో మహాత్మా బసవేశ్వర జయంతి వేడుకలు శుక్రవారం వీరశైవ లింగాయత్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బసవేశ్వర చిత్రపటానికి నివాళి అర్పించారు. బస్మాంగి శంకరయ్య, సాంబయ్య, పెనాల మొండయ్య తదితరులున్నారు.

యూపీఎస్సీ ఫలితాల్లో సైనిక విద్యార్థుల ప్రతిభ



వి.అభిలాష్



ఆర్.సిద్ధార్థ



జి.వినయ్‌కుమార్



జె.నర్సింహులు



ఎం.విష్ణువర్ధన్

చొప్పదండి: రుక్మాపూర్ శివారులోని సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక శిక్షణ పాఠశాలకు చెందిన విద్యార్థులు యూపీఎస్సీ, ఎన్డీఏ వెలువరించిన పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. రాత పరీక్షలో సైనిక పాఠశాలకు చెందిన అయిదుగురు విద్యార్థులు అర్హత సాధించి ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారు. స్టాఫ్ సెలక్షన్ బోర్డుకు అర్హత సాధించిన వారిలో వి.అభిలాష్, ఆర్.సిద్ధార్థ, జి.వినయ్‌కుమార్, జె.నర్సింహులు, ఎం.విష్ణువర్ధన్ ఉన్నారు. వీరికి వచ్చే డిసెంబర్, జనవరి నెలల్లో మౌఖిక పరీక్షలు జరుగుతాయి. గతంలో 2022లో కూడా క్యాడెట్ అశోక్‌సాయి, క్యాడెట్ ఉమాకాంత్ అనే విద్యార్థులు ఎయిర్‌ఫోర్స్ విభాగంలో కమీషన్డ్ ఆఫీసర్లుగా ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర సాంఘిక, సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సెక్రటరీ సీతాలక్ష్మి, డైరెక్టర్ కేసీరావు, ప్రిన్సిపాల్ సీహెచ్ లచ్చయ్య అభినందించారు. తోడుగా ఉన్న ఉపాధ్యాయ బృందాన్ని ప్రశంసించారు.

మోదీకి మద్దతు పలకాలి



చొప్పదండి: ప్రచారం చేస్తున్న చేపూరి సత్యనారాయణ



వీణవంక: ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

చొప్పదండి: అవినీతికి తావు లేకుండా మచ్చ లేని సుపరిపాలన అందిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీని మూడోసారి ప్రధాన మంత్రిని చేసేందుకు ప్రజలంతా పార్టీలకతీతంగా మద్దతు పలకాలని బీజేపీ జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ కోరారు. పట్టణంలోని 13వ వార్డులో ఇన్‌చార్జి జిట్ట కుమార్ ఆధ్వర్యంలో మహిళలు శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ఎంపీ అభ్యర్థిని రెండు లక్షల మెజారిటీతో గెలిపించి మోదీకి కానుకగా ఇవ్వాలని కోరారు. వారి వెంట అర్ధవెల్లి శ్రీను, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

వీణవంక: మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కు మద్దతుగా శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. విజయ్‌చందర్‌రెడ్డి, నరసింహరాజు, మాగ గౌతమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: మడిపల్లి గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు సంపెల్లి సంపత్‌రావు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రఘు, రాజేందర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామడుగు: షానగర్ గ్రామంలో బీజేపీ నాయకులు ప్రచారం చేశారు. బొమ్మకంటి భాస్కరాచారి, కట్ట రవీందర్, జిట్టవేని అంజిబాబు, శ్రీధర్, రమేశ్, రమణాచారి, వెంకటేశ్ పాల్గొన్నారు.

శంకరపట్నం: కొత్తగట్టు, మొలంగూర్, కరీంపేట తదితర గ్రామాల్లో శుక్రవారం బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు వద్దకు వెళ్లి బీజేపీకి ఓటేయాలని కోరారు. మాడ వెంకట్‌రెడ్డి, దండు కొమురయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

మానకొండూర్‌రూరల్: మండల కేంద్రంలో ఇటీవల హన్మండ్ల భారతమ్మ, ఎం.ఎల్లమ్మ మృతిచెందారు. మాజీ ఎమ్మెల్యే మోహన్ మృతుల కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కోంద్ర శంకర్, యు.వెంకట్‌స్వామి, యు.నారాయణ తదితరులున్నారు.